కథ

# పెన్ ఫ్రెండ్



**ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి**

విజయవాడ నుండి అమలాపురం వెళ్ళే బస్ వేగంగా పరుగెడుతోంది. బస్‌లో ఉన్న శ్రీకాంత్ ఆలోచనలు అంతకన్నా వేగంగా పయనిస్తున్నాయి.

జీవితం ఎంత విచిత్రమైంది ? తను విజయవాడ ఏ ఉద్దేశ్యంతో వెళ్ళాడు, కానీ అక్కడ జరిగిందేమిటి ? ఏ విధంగా తను మారాల్సి వచ్చింది ? ఎవరో మహాకవి అన్నట్టు మనం అనుకున్నవన్నీ జరిగితే ఆ భగవంతుడెందుకు ? ఎందుకు మనల్ని నవ్విస్తాడో తెలియదు. అంతలోనే విషాదంలోకి ఎందుకు నెట్టేస్తాడో తెలీదు కదా ?

అసలు తను విజయవాడ వెళ్ళాలని ఎప్పుడు అనుకున్నాడు ? శ్రీకాంత్ కళ్ళు మూసుకుని గతం నెమరు వేసుకోసాగాడు.

* * *

"శ్రీకాంత్, మా పాపకు చక్కని పేరొకటి సజెస్ట్ చేయవయ్యా" అన్న వదినగారి మాటలకు బుద్ధిగా తలూపి "రేపు చెపుతా" నన్నాడు శ్రీకాంత్.

శరత్ దగ్గర పెన్‌ఫ్రెండ్స్ జాబితా గుర్తుకు వచ్చి అతనింటికి వెళ్ళాడు. సమయానికి అతను ఇంటి వద్దే ఉన్నాడు. కుశల ప్రశ్నలైన పిమ్మట అతని దగ్గర జాబితా తీసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనమైన తరువాత తనగదిలోకి వెళ్ళి తీరికగా లిస్ట్ తిరగేయసాగాడు. నాలుగు పేజీలు చూసాకా ఐదో పేజీలోని మొదటి పేరు అతన్ని విశేషంగా ఆకర్షించింది.

నీహారిక...

అబ్బ ఎంత సొగసైన పేరు అనుకున్నాడు. ఒకసారి కాదు.. చాలా సార్లు. ఎందుకో ఆమెతో కలం స్నేహం చేయాలనిపించింది. వెంటనే అందంగా అక్షరాలతో మాలగ్రుచ్చి ఆమె అడ్రెస్‌కు పంపాడు.

మర్నాడు వదినగారి పాపకు శైలజ అని పేరు పెట్టమని చెప్పాడు. శ్రీకాంత్ నీహారికకు లేఖ వ్రాసి వారం రోజులైంది. ఏ వారం రోజులూ అతను అనుభవించిన టెన్షన్ చెప్పనలవి కానిది. చివరకు ఒక రోజున పోస్ట్‌మేన్ అతనికొక గులాబీ రంగు కవర్ ఇచ్చాడు.

కవరు మీద అడ్రస్ చూడగానే అతను ఆనందం పట్టలేక అన్నగారి పాపను ఎత్తుకుని ముద్దుల వర్షం కురిపించాడు. అక్కడే ఉన్న శ్రీకాంత్ వదిన అతని చేష్టలకు నిర్ఘాంత పోయింది. అది గమనించిన శ్రీకాంత్ సిగ్గుపడి పాపను క్రిందకు దింపి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అతనితో కలం స్నేహం తనకూ ఇష్టమేనంటూ వ్రాస్తూ తను బి.ఎ. పాసైనానని ప్రస్తుతం ప్రైవేటుగా ఎమ్.ఎ. చదువుతున్నానని వివరించింది నీహారిక తన లేఖలో.

శ్రీకాంత్‌కి చాలా సంతోషం కలిగింది. చాలా వరకూ ఆమె హాబీలూ, అతని హాబీలు సరిపోయాయి. వారిరువురి ఇష్టాలు కూడా దాదాపుగా ఒక్కటే. ఆమెకు కూడా దేవులపల్లి సాహిత్యమన్నా, ఘంటసాల పాటలన్నా ఎంతో ఇష్టమట. ఇలా వారి అభిరుచుల్ని, అలవాట్లనీ ఒకరకొకరు తెలుపుకొంటూ ఆరు నెలలపాటూ ఉత్తరాయణం సాగించారు.

కొన్నాళ్ళకు ఆమెని ఫొటో పంపమని అడుగుతూ వ్రాసాడు. పదిరోజుల వరకూ ఆమెనుండి జవాబు రాలేదు. అతను మధనపడిపోసాగాడు. ఫొటో పంపమని కోరకుండా ఉండాల్సింది అనుకున్నాడు. అతనా సందిగ్ధంలో ఉండగా ఒకరోజు పోస్ట్‌మేన్ గులాబీరంగు కవరు తీసుకొచ్చి ఇచ్చాడు. సంతోషంతో అతన్ని కౌగలించుకుని 'హుర్రే' అందామనుకున్నాడు. కానీ ఇంట్లో వాళ్ళు తనని పిచ్చివాడిగా జమకడతారని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

ఆతృతతో గుండె దిటవు చేసుకుని కవరు విప్పాడు. బంధువులింటికి వేరే ఊరికి వెళ్ళవలసి వచ్చిందనీ అందువల్ల లెటర్ వ్రాయడం ఆలస్యమైందని వ్రాస్తూ ఫొటో పంపించింది.

నీహారిక ఫొటో చూడగానే ఆనందంతో అతని మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేయసాగింది. సౌందర్యానికి ప్రతీకగా మూర్తీభవించిన ఆమె రూపాన్ని ఫొటోయే అయినా పరిసరాలు మరిచి చాలాసేపు చూస్తుండిపోయాడు. ఆమె రూపంలో పవిత్రమైన మధురభావం లీలగా కనిపించి అతని మనసును దూదిపింజలా తేల్చివేసింది. ఏది ఏమైనా సరే నీహారికను కలిసి ప్రత్యక్షంగా మాట్లాలని నిర్ణయించుకున్నాడు.

తర్వాత కొన్ని నెలలకు కాంపిటిటీవ్ పరీక్షలు వ్రాయడానికి విజయవాడకి వెళ్ళాల్సి వచ్చింది శ్రీకాంత్‌కి. సడెన్ సర్‌ప్రయిజ్ చేద్దామని లెటర్ కూడా వ్రాయకుండా నీహారికి చిరునామా వెదుక్కుంటూ వెళ్ళాడు. ఆమె ఇంటిని సులభంగానే కనుక్కోగలిగాడు. ఐదు పెద్ద గదులతో ఉన్న డాబా అది. గేటుదగ్గరనుండి సింహద్వారం వరకూ సన్నని కాలిబాట, బాటకిరువైపులా రంగురంగుల పూలచెట్లు గాలికి ఊగుతుంటే స్వాగతం చెపుతున్నట్టుగా ఫీలయ్యాడు.

డ్రాయింగ్ రూమ్‌లో సుమారు యాభయ్ సంవత్సరాల వ్యక్తి పేపరు చదువుతున్నాడు.

"కృష్ణమూర్తిగారి ఇల్లు ఇదేనాండీ ?" అడిగాడు శ్రీకాంత్.

"ఇదే. ఎవరు కావాలి మీకు ?"

"నా పేరు శ్రీకాంత్. నేను నీహారిక పెన్‌ఫ్రెండునండి"

"ఓ. నీహారిక పెన్‌ఫ్రెండువా ?" అని "విజయా ఓ సారి ఇలారా. నీహారిక కోసం శ్రీకాంత్‌ట. వచ్చారు" అని ఆయన పిలవడంతో నడివయసు ఉన్న ఒకామె లోపలనుంచి వచ్చారు. సాక్షాత్తూ పార్వతీదేవిలా ఉన్న ఆమెను చూడగానే "నమస్కారమండీ" అంటూ చేతులు జోడించాడు.

"నిలబడ్డావేం ? కూర్చోబాబు" అంటూ ఆమె లోపలికెళ్ళి టిఫిన్, కాఫీతో తిరిగొచ్చింది. బిడియపడుతున్న అతని చేత దగ్గరుండి టిఫిన్ తినిపించిందామె. ఆమె చూపుతున్న ఆప్యాయతకు, ఆత్మీయతకు శ్రీకాంత్‌కి ఎనలేని ఆనందం కలిగింది. ఏ దంపతుల హృదయాలలో తన ఉన్నత స్థానానికి అబ్బుర పడ్డాడు కూడా.

కానీ కొంత నిరుత్సాహం కూడా కలిగిందతనికి. తన కలలరాణి, ఆరాధ్యదైవం "నీహారిక" టిఫిన్ తెస్తే ఎంత బాగుండేది ? తన జీవిత గ్రంథంలో ఈనాటి సంఘటన ఒక మహత్తర పుటగా నిలిచి ఉండేది కదా అనుకున్నాడు.

"బాబూ. నీతో కొన్ని విషయాలు మనసు విప్పి చెప్పుకోవాలనుంది. నువ్వు అన్యధా భావించవు కదా ?" అన్నదావిడ.

"ఎంత మాట. పెద్దలు మీరు చెపుతుంటే మరోలా అనుకోవడమా ? నా పట్ల మీరు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞుడిని. చెప్పండి" అన్నాడు.

"బాబూ. మాకు నీ వయసే ఉన్న ఒకే ఒక్క కొడుకు ఉండేవాడు. ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తుండేవాడు. భగవంతుడు నిర్దయగా వాడిని తన దగ్గరకు తీసుకుపోయి మాకు పుత్రశోక మిగిల్చాడు. వాడు పోయిన తర్వాత వాడి పుస్తకాలు సర్దుతుండగా వాడి డైరీలో "నీహారిక" ఫొటో కనిపించింది. అడ్రస్ ఏమీ లేకుండా ఆ ఫొటో వెనుక నీహారిక అన్న పేరు మాత్రం ఉంది. అమెకూ మా అబ్బాయికీ గల సాన్నిహిత్యం వాడి డైరీ వల్ల మాకు తెలిసింది.

మాకు వాడి తర్వాత పిల్లలు లేకపోవడంతో మా ఆస్తిని చూసి బంధువుల్లో చాలా మంది తమ పిల్లల్లో ఒకరిని పెంచుకోమని కోరుతూ ఒత్తిడి తెచ్చారు. ఆ సమయంలోనే మా వారికి ఒక ఆలోచన వచ్చింది. పత్రికలలో కలం స్నేహం పేజీల్లో నీహారిక పేరుతో మా అడ్రసు ఇచ్చాము. వెంట వెంటనే చాలా మంది ఉత్తరాలు వ్రాసారు. ఇప్పటి వరకూ దాదాపు పదిహేను వందల ఉత్తరాలు వచ్చాయి. అందులో చాలామంది ఆమె ఫొటో పంపమని కోరారు. అలా కోరిన వాళ్ళందరికీ నీహారిక ఫొటో కాపీలు తీయించి పంపాము.

నీహారికను కలుసుకునేందుకు వచ్చిన వాళ్ళల్లో మా అబ్బాయి పోలికలు ఉన్న వాడిని పెంచుకుందామని మా కోరిక. అందుకే కష్టమైనా నష్టమైనా ఈ మార్గం ఎన్నుకున్నాం. ఇంతవరకూ ఎంతో మంది వచ్చారు. ఎవరూ మాకు నచ్చలేదు. వాళ్ళు నీహారిక గురించి అడిగితే ఊరు వెళ్ళిందని చెప్పేవాళ్ళం. వాస్తవానికి ఆ ఫొటోలోని నీహారిక ఎక్కడుందో మాకు కూడా తెలీదు. మా ఇంటి కోడలు కావలసిన అమ్మాయి మా దురదృష్టం కొద్దీ కొడుకుతో పాటూ, బాంగారంలాంటి ఆ అమ్మాయిని కోడలుగా పొందే అదృష్టాన్ని కూడా కోల్పోయాం" అప్రయత్నంగా ఆమె కళ్ళనుండి జలజలా అశ్రువులు రాలాయి. వాళ్ళ కథ వింటున్న శ్రీకాంత్ కూడా అదే స్థితికి లోనయ్యాడు. కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నాడు. అంటే తన ఆరాధ్యదైవం కేవలం ఊహాసుందరేనా ? ఒక్కక్షణం అతని హృదయంలో శూన్యం ఆవరించింది.

"నిన్ను చూస్తుంటే మా అబ్బాయి రాజేష్ గుర్తుకు వస్తున్నాడు. అందుకే యదార్థం నీకు చెప్పాం. ఏం బాబూ. మా మీద నీకు అసహ్యంగా ఉంది కదూ" బేలగా అడిగిందావిడ.

"లేదండీ. కన్న ప్రేమతో పిల్లలకోసం మీరెంతగా తపించిపోతున్నారో నేనర్థం చేసుకోగలను" అన్నాడు.

ఆమె కళ్ళు ఆనందంతో మెరిసాయి. "బాబూ. నీకిష్టమైతే నిన్ను మేము దత్తత చేసుకుంటాము. మాతో ఉండిపోతావా ?" అడిగిందామె.

ఆమె ఆతృతతో అతని చేయి పట్టుకుని అర్థిస్తోంటే చలించిపోయాడతను. కొన్ని క్షణాలు అతని నోట మాట రాలేదు. వాళ్ళ కుటుంబంలో కొడుకు మృతి ఎటువంటి లోటును చేసిందో ఆమె మాటల ద్వారా తెలిసింది.

ఆ లోటును తను పూడ్చగలడా ? వాళ్ళకు బిడ్డగా మారి వారు కోరే ప్రేమను అందించగలడా ? అతని ఆలోచనలు పరిపరి విధాలుగా పోయాయి.

ఏది ఏమైనా ఆ దంపతుల్ని ఆనందపరచాలి. కన్న కొడుకునుండీ, అతని ప్రేమనుండి దూరమైన తల్లిదండ్రుల హృదయాలలో సంతోష వీచికలు కదలాడాలి. ఒక నిర్ణయానికి వచ్చాడతను.

"చూడమ్మా. నాకూ తల్లిదండ్రులున్నారు. అన్నా చెల్లీ కూడా ఉన్నారు. మీరు కోరిన విధంగా దత్తత రాలేను. కానీ వారం వారం వచ్చి మిమ్మల్ని చూసి వెళతాను. ఎంత కష్టమైనా సరే. మీ మంచి చెడ్డలు నేను చూస్తాను. మీకు నన్ను ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు సంకోచించకుండా టెలిగ్రాం ఇవ్వండి. వెంటనే వచ్చి వాల్తాను" అన్నాడు ఊరడింపుగా శ్రీకాంత్.

ఆ దంపతుల కళ్ళల్లో ఆనంద వీచికలు కదలాడడం అతను గమనించాడు. వాళ్ళు అతన్ని తలవని తలంపుగా దొరికిన పెన్నిధిలా భావించడం అతనికి సంతోషాన్నిచ్చింది. ఆ రోజు వాళ్ళ బలవంతంపై అక్కడే భోంచేసాడు. అతని చేత పదే పదే అమ్మా అని పిలిపించుకుని విజయలక్ష్మిగారు తన్మయులవడం చూసి కృష్ణమూర్తిగారు కళ్ళు వత్తుకున్నారు.

సాయంకాలం వాళ్ళతో కలిసి కనకదుర్గమ్మ గుడికి వెళ్ళాడు శ్రీకాంత్. విజయలక్ష్మిగారు అతని పేరు మీద అర్చన చేయించారు.

శ్రీకాంత్‌కి ఇదంతా సినిమాలా అనిపిస్తోంది. చిన్నప్పుడు తప్పిపోయిన కొడుకు యుక్త వయసులో అకస్మాత్తుగా కనిపిస్తే తల్లిదండ్రులకి ఎటువంటి ఆనందం కలుగుతుందో వాళ్ళిద్దరికి కూడా అలాంటి ఆనందమే కలిగింది.

గుడినుండి బస్‌స్టాండ్‌కి వచ్చారు ముగ్గరూ. అప్పటికప్పుడు శ్రీకాంత్ వాళ్ళ అన్నగారి పాపకు బొమ్మలు, స్వీట్స్ కొని ఇచ్చారు విజయలక్ష్మిగారు. వారు తనపై చూపే అవ్యాజ్యమైన ప్రేమకి తట్టుకోలేకపోతున్నాడు శ్రీకాంత్.

అమలాపురం బస్ రావడంతో శ్రీకాంత్ గబగబ వెళ్ళి సీటు చూసుకుని కూర్చున్నాడు. విండో దగ్గర శ్రీకాంత్‌కు విజయలక్ష్మిగారు ప్రయాణ జాగ్రత్తలు చెపుతున్నారు. బస్ హారన్ మోగింది.

"శ్రీకాంత్, వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తావు కదూ ?"

"తప్పకుండా వ్రాస్తానమ్మా."

"అమ్మా" అన్న మాట అతని నోటినుంచి రాగానే ఆమె పరిస్థితి గట్టుతెగిన గోదావరే అయ్యింది. కృష్ణమూర్తిగారు ఆమెను ఓదార్చుతున్నారు. శ్రీకాంత్ కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకుంటూ చెయ్యూపాడు.
బస్ డిపో దాటి గమ్యం వైపు ప్రయాణించింది.

శ్రీకాంత్ పక్క సీటతను అడిగాడు "ఆవిడ మీ అమ్మగారా బాబూ ? అంత బాధ పడిపోతున్నారు. పోనీ ఇంకో రెండు రోజులుండి బయల్దేరలేక పోయారా ?" అని.

శ్రీకాంత్ మౌనంగా తలూపాడు. 'అవును ఆమె తన అమ్మే. దేవుడిచ్చిన అమ్మ. అసలు రాజేష్ ఎందుకు ఎయిర్ ఫోర్స్‌లో చేరాడు ? కొడుకు మీద ఇంతటి మమకారం గల ఈవిడ ఎందుకు ఒప్పుకుంది ? బహుశా అతను మొండి పట్టు పట్టి ఉంటాడు. ఒక్కగానొక్క కొడుకు కావడంతో అతని కోర్కెను కాదనలేక పోయి ఉంటుంది.

ఆలోచనలో పడి మెల్లగా నిద్రలోకి జారిపోయాడు.

బస్ అమలాపురం చేరిన తర్వాత పక్కసీటతను శ్రీకాంత్‌ని తట్టి లేపాడు. బస్ దిగి ఇంటికి చేరుకున్నాడు శ్రీకాంత్.

* * *

మరునాడు ఉదయం వదిన గారు హడావిడిగా శ్రీకాంత్‌ని నిద్రలేపి "టెలిగ్రాం వచ్చిందంటూ" చెప్పింది. "విజయ ఎక్స్‌పైర్డ్. స్టార్ట్ ఇమీడియెట్‌లీ – కృష్ణమూర్తి". టెలిగ్రామ్ చూడగానే కుప్పకూలిపోయాడు శ్రీకాంత్. దేవుడిచ్చిన అమ్మ అంటూ ఎంతో మురిసిపోయిన అమ్మ, వెళ్ళగానే ఉత్తరం వ్రాయి బాబూ అని చెప్పిన అమ్మ ఇరవై నాలుగు గంటలు కాకుండానే అందని దూరతీరాలకు వెళ్లిపోయిందా ? మనస్సుని సమాధాన పరుచుకోలేకపోతున్నాడు.

వెంటనే బయలు దేరి విజయవాడ వెళ్ళాడు.

శ్రీకాంత్‌ని చూడగానే కృష్ణమూర్తిగారు బావురుమన్నాడు. ఆయనను ఓదార్చడం శ్రీకాంత్ వల్ల కాలేదు. "ఎలా జరిగింది ?" అని అడిగాడు.

రాజేష్ మరణ వార్త విన్న తర్వాత ఆమెకు మొదటిసారిగా హార్ట్ ఎటాక్ వచ్చింది. తదుపరి నిన్న శ్రీకాంత్ రావడం తిరిగి తన కొడుకు తనకు లభించాడన్న ఆనందాన్ని ఆ చిన్న గుండె భరించలేకపోయింది. అందుకే ఆగిపోయిందని చెప్పారు అక్కడి వాళ్ళు.

కృష్ణమూర్తిగారి అభీష్టం మేరకు శ్రీకాంత్ ఆవిడ కొడుకులా వ్యవహరించి కర్మకాండలన్నీ నిర్వర్తించాడు.

"పుట్టిన వానికి మరణం తప్పదు. మరణించిన వానికి జన్మమూ తప్పదు. అనివార్యమగు ఈ విషయమును గూర్చి ధీరులు శోకింపరు" గుడిమీదున్న మైకులోంచి ఘంటసాల గీతాబోధన వినిపించింది శ్రీకాంత్‌కు.

పదిరోజుల కార్యక్రమం ముగిసిన తర్వాత శ్రీకాంత్ కృష్ణమూర్తిగారిని తనతో తీసుకు వెళ్ళాడు. కనీసం ఆయన చివరి కాలమైనా ప్రశాంతంగా సాగడానికి, అభిమాన పుత్రుడిలా తనవంతు కర్తవ్యం నెరవేర్చడానికి.

**-- సమాప్తం --**